# సిన్నోడికే నమ్మా సిన్నోడ్ని



— పులికంటి కృష్ణారెడ్డి

"చూడు మిస్టర్ బాలకృష్ణా! యిప్పటికా ఉత్తరాన్ని అయిదుసార్లు చదివినావు. ఆరోసారి చదవబోతున్నావు. ఏముందందులో ?"

"నా ఉత్తరాన్ని గురించి అడగడానికి నువ్వెవ్వరు ?"

"ముందట అడిగింది నేను బదులు చెప్పవలసింది నువ్వు. అదిసంస్కారం:"

"అంటే-నాకు సంస్కారం లేదంటున్నావా?"

"—అని నేననలేదు. ఆ మాట నన్నడగడమెందుకు?—నీకు తెలియక పోతేగా?—ఇంతకూ నేనడిగింది నీ ఉత్తరాన్ని గురించి."

"నా ఉత్తరాన్ని గురించి నీ కెందుకూ?"

"అది ప్రియురాలి ప్రేమ లేఖ కాదే?"

"అవును."

"పోనీ! ఉన్నట్లుండి చేస్తున్న ఉద్యోగం ఉన్నతికెక్కిన ఉదంతమూ కాదు."

"కాదు"

"ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కినట్లు—ఈ దేశంలో పుట్టి ఈ దేశంలోనే పెరిగి నాలుగు తేట తెలుగు మాటల్ని అనడానికి వినడానికి నోచుకోలేని నీకు కౌలాలంపూర్‌లో తెలుగు తనాన్ని ఆస్వాదించడానికి ఆహ్వానమూ కాదు"

"అవును"

"అందుకే అడిగాను—ఆరవ సారి చదవడానికి యత్నిస్తూంటే."

"ఇంతకూ నువ్వెవ్వరు?"

"చెప్పినా తెలుసుకోలేవు."

"ఓయబ్బో! ఏమిటో ఆ అవ్యక్త వ్యక్తిత్వం?"

"నేను మనిషిలో మనిషిని. అంతర్ముఖంగా చూడగలిగితే నన్ను అద్దంలో బింబంలా చూడవచ్చు."

"అయితే నాలోని నువ్వు—నన్నడగడమెందుకు"

"నీ నోటితో చెప్పించాలని."

"దానివల్ల నీకు కలిగే ప్రయోజనం?"

"నీ తప్పు నువ్వు తెలుసుకోగలవేమో?—అన్న దురాశ."

"దురాశ దుఃఖానికే చేటు?"

"ఒకరి దుఃఖం యింకొకరికి సంతోషంగా పరిణమించవచ్చు."

"అయితే విను అమ్మ వ్రాయించింది.

"....ఆ పల్లెటూళ్ళో .. ఉడిగిన కాలంలో పూరి గుడిసెలో—తన చెయ్యి తాను కాల్చుకోలేక.... ఎవరి దయాదాక్షిణ్యాలమీదనో ఆధార పడలేక.... పూట గడవడం ఓ యుగంగా... నానా అవస్థలు పడుతున్నానన్న పాత పాటే గదా?"

"కాదు"

"మరి?"

"ఈసారి తప్పనిసరిగా నేను వెళ్ళవలసి నట్లుంది"

"ఈదేశంలో అడపాదడపా 'మీసా' అవసరం రావచ్చునేమోకానీ—పల్లెటూరికి వెళ్ళడానికి 'వీసా' అవసరంలేదే?—మరి ఎందుకలా విలవిలలాడిపోతున్నావ్?"

'వీసా' కావలసింది పల్లెటూరికి వెళ్ళడానికి కాదు. నాఇంట్లో నాతో నాతల్లిని వుంచుకోవడానికి"

"నీ మీసాలేమైనాయి?"

"ఎప్పుడో గొరిగించుకొన్నాను—అక్కడొకటి అక్కడొకటి తెల్లబడుతూంటే!"

"మిస్టర్ బాలకృష్ణా! మూతికి మీసం

పోటీలో మొదటి బహుమతి రు. 1000 పొందిన కథ

అందం. మనిషికి పౌరుషంఅందం. పౌరుషహీనమైన బ్రతుకు బ్రతకడంకంటే...."

"—ఆత్మహత్య మేలంటావ్?—అయితే కట్టుకొన్న పెళ్ళాం.... కన్నబిడ్డలు.... ఉన్నారుగా? మరి వాళ్ళబాధ్యత?"

"కట్టుకొన్న పెళ్ళాం.......కన్నబిడ్డలు—బాధ్యతలయితే కన్నతల్లి కాదుగదా?"

"బాధ్యత కాదనుకొంటే ఆలోచించడమెందుకు?"

"ఆలోచించి యేంచేయగలుగుతున్నావ్?"

"ఎన్నోసార్లు అమ్మను నాతో వుంచుకోవడానికి యత్నించాను."

"అయితే ఏమయింది?"

"—ఎలాపిలిచిన పలుకుతాడు మనిషి కానీ—ఆ పిలుపుదగ్గరే ఆరంభమవుతుంది ఇద్దరికీ పేచీ: 'ఒరే! సిన్నోడా! అంటుంది అమ్మ. వందమందికిపైగా పనిచేస్తున్న ఆఫీసులో. 'పెదయ్యగారు'గా పేరుగడించిన మొగుడు 'సిన్నోడు'కావడం పెళ్ళానికి చిన్నతనం. 'బాలూ!' అని వయ్యారాలు ఒలుకబోస్తూ పిలుస్తుంది పెళ్ళాం. 'బాలకృష' అని ఎంతో ముద్దుగా పెట్టుకొన్న పేరును కోడలు తనకండ్ల ఎదుటే నిర్దాక్షిణ్యంగా చెరిసగానికి కత్తిరించడం గుండెల్నికోసినట్లుంది అమ్మకు. ఏంచెయ్యమంటావ్?"

"బాలకృష్ణా! నువ్వు దోగాడుతున్న వయస్సులో చాలాఅందంగా వుండేవాడివి. ఇంతింత కళ్ళు....చిదిమితే పాల్గారు బుగ్గలు....గుబుర్లు గుబుర్లుగా వెంట్రుకలు.—చూడముచ్చటగొలిపేది నీ రూపం. అయినా నీతల్లికి నిన్ను చంకకెత్తుకొని అందని చందమామను అరచేతిలోచూపిస్తూ గోరుముద్దలు తినిపించడానికి తీరికెక్కడిది పాపం?—ఉన్నది రెండెకరాల కొండ్ర. అందులోపడి పొర్లాడడానికే తీరికలేదు పాపం. ఇక నిన్నెక్కడ ఎత్తుకొని ముద్దులాడుతుంది. అయినా ఆడికో....అమావాస్యకో ఓదినం ఊపిరి సలుపుకోగలిగితేచాలు ఎంతో సంబరపడిపోయేది!

నీకు తెలుసునో తెలియదో మిష్టర్ బాలకృష్ణా! నీ పక్కింటి మేడకు మెడబిర్రుఎక్కువ. అయినా మీ అమ్మ మంచితనంముందు ఆ మెడబిర్రు మెలికలు తిరిగేది. సాదుచిప్పా—పౌడరు డబ్బా—మెడబిర్రుకు మెరుగులుదిద్దే రెండుమూడు నగలూ—మిద్దింటినుండి గుడిసెకు 'సదుపడి' లేకుండా నడచివచ్చేవి. ఆ రోజు నీకు చక్కగా స్నానంచేయించేది. వళ్ళంతా పౌడరద్దేది. గుబురు వెంట్రుకల్ని ముందుకు దువ్వి 'కృష్ణకొండి' వేసేది. చక్కని సాదుచుక్క పెట్టేది. అరువుతెచ్చిన నగల్ని నీ ఒంటిమీదవేసేది. అలా అలంకరిస్తే నువ్వు అచ్చం కృష్ణుడిలా ఉండేవాడివి. అప్పుడామె చేతులునుండి విడిపించుకొని ఆమె చేతికిచిక్కకుండా పరుగులుదీస్తూ అల్లరిచిల్లరి పనులు చేస్తూంటే—ఎలాగో తరిమి పట్టుకొని—గుండెలకదుముకొని 'నా చిన్ని కృష్ణుడమ్మా! నా చక్కని కృష్ణుడమ్మా!!' అని ముద్దులాడేది. అందుకే ముచ్చటపడి 'బాలకృష్ణ' అని పేరు పెట్టుకొనింది."

"అవును. లీలగా జ్ఞాపకమొస్తూఉంది."

"మిస్టర్ బాలకృష్ణా!! మీదొక పూరిగుడిసె. గుడిసెముందొక మేడ ఆ మేడలో మనుష్యులకు మెడమీద కండలు. ఆ కండగలిగిన మనుష్యులకు ఓ దొండపండులాంటి బిడ్డ. కన్నపేగు ఎన్నోపాట్లుపడింది—ఎదురింటితో పోటీపడి నిన్ను పెంచడానికి. కాబట్టే ఈనాడు నీవీమాత్రం కుర్చీలో నింపాదిగా కూర్చోగలిగావు.

"అవును"

"అన్నిటికీ 'అవును! అవును!!' అని గంగిరెద్దులా తలూపుతున్నావే?—నీ పెళ్ళానికి ఈమాత్రం నచ్చచెప్పుకోలేకపోయావ్?"

"చెబితే—'ఏవండీ? ఏమిటా యేరికి పోకిరి పిలుపులు?—సిన్నోడా! పెద్దోడా!! అని....అచ్చం పల్లెటూరి అవతారాల్లాగా? వయసు పెరిగితే యేంలాభం? వర్తన పెరగాలి కానీ!—ఆ మాత్రం మర్యాదగా మసలుకోమని చెప్పలేకపోయారా మీ తల్లిగారికి?' అని దెప్పిదెప్పి పొడుస్తుంది పెళ్ళాం!"

"తల్లికి మర్యాదలు నేర్పాలా?"

"కాదు. పెళ్ళానికి తృప్తికలిగించాలి."

"అడ్డకత్తెరలో పోకవు"

"ఏంచేయమంటావ్?—అమ్మ రమ్మంటే వస్తుంది. ఓ రెండు మూడునాళ్ళు ఏబెడదా వుండదు. ఆతరువాత కోడలు అత్తమీది కోపాన్ని దుత్తమీద చూపుతుంది. ఈ కోడలు కూడ ఒకనాటికి 'తల్లి' అవుతుందన్న సంగతి మరచిపోతుంది. ఎటూ మాట్లాడలేక నేను నలిగిపోతూంటే—నా అసమర్థతను చూచి అసహ్యపడవలసిన అమ్మ జాలిపడుతుంది."

"అది కన్నపేగు"

"అందుకే వచ్చినంత త్వరగానే ప్రయాణం కడుతుంది"

"మిస్టర్ బాలకృష్ణా! నీకు అధికారముంది. నీ మాటంటే ఆఫీసులో హడలిచస్తారు. నీకు ఐశ్వర్యముంది. ఆశించిందిఅరచేతిలోనికినడచి వస్తుంది. నీకు దేనికీ దిగులులేదు. అయినా నువ్వు కనీసం మానసికంగా యాతనపడడం కూడా నీతల్లి సహించలేకపోతూవుంది. అందుకే వచ్చిన మూడోనాటికే మూటాముల్లె సర్దుకొంటుంది."

"అవును"

"అది కన్నపేగు"

"నేను కాదన్నానా?"

"కాదనడంలేదు, కొననడమూలేదు"

"అయితే ఏంచెయ్యమంటావ్?"

"వెనుదిరిగి చూడమంటాను"

"చూస్తూనేవున్నాను"

"చూస్తే ప్రయోజనం?—ఆలోచించాలి కానీ—"

"ఆలోచిస్తూనేఉన్నాను"

"ఏమని?"

"అమ్మకు బాగా వయసుమళ్ళింది. కూర్చుంటే లేవడంకూడాకష్టం. లేస్తే కూర్చోవడం కష్టం. ఆమెకు తోడుగా ఓ మనిషి అవసరం. ఆమెకుస్నానంచేయించాలి. బట్టలుకట్టాలి వేళకంత తినిపించాలి. ఆమె శంకలు తీర్చాలి. నేనామెకుబిడ్డనే! ఆమె నాకుతల్లే!- అయినా కూడా మగవాడుగా ఈ పనులన్నీ నిర్వహించ కష్టం. తోడుకు ఉద్యోగమొకటేడ్చింది!—ఉదయాన వెళ్ళితే సాయంకాలమే తిరిగి రావడం. ఈ లోపుగా ముసలావిడగతి?- ఆమెనో రారా 'సిన్నోడా!' అని పిలుస్తూంటేనే సహించలేనిఆడది-ఆమెకు సపర్యలు చేస్తుందా? ఓ పనిమనిషిని పెడితే తన సపర్యలు చేయించుకోవడంతోనేసరిపుచ్చకపోతుందా?"

"అయితే ఏం చేద్దామనుకొంటున్నావ్?"

---

చావుబ్రతుకుల్లో ఉందట! టెలిగ్రాం వచ్చింది సార్!.... చూడండి

ఆ పల్లెటూళ్ళో దిక్కూ దరీలేదు సార్! గొంతులో అంతవుండు పోయ

డానికక్కడా డాక్టర్లుండరు. ఒకవేళ నేను వెళ్ళేటప్పటికే....ఎగ్గొట్టక

వస్తున్న ఏడుపు మాటల్ని మింగేసింది అయితే సెలవుపెట్టి వెంటనే....

"పున్నెంకొద్దీ పురుషుడు. అదృష్టం కొద్దీ బిడ్డలు."

"మనిషి స్వార్థంతో అందంగా అల్లుకొన్న పదాలు"

"కాదు-అనుభవం నేర్పిన పాఠాలు"

"అయితే యిప్పుడీ పాఠాన్ని తల్లిమీదనే ప్రయోగించడానికి తలపడుతున్నావ్ ?"


"తప్పేంటట్టుగాలేదు."

"ఈసాహసానికే మీతల్లి ఒడిగట్టివుంటే-"

"ఫరవాలేదు. ఈ మాత్రం యింగితజ్ఞానమైనా మిగిలివుంది. అందుకు నిన్ను తప్పకుండా అభినందించి తీరాలి"

"అభినందన సంగతి దేవుడెరుగు అవసానదశలో అమ్మను ఆదరించలేని దౌర్భాగ్యుడన్న అవమానం నుండి విముక్తి దొరికితే చాలు"

"మనిషి యింతపిరికివాడు కాకూడదు బాయీ !"





"గతాన్ని త్రవ్వతావెందుకూ ?"

"ఏం ?- చేదుమాత్రలు మింగినట్టుందా ?"

"లేదు. చెవిటికి శంఖూదినట్లుంది"

"-అని అనుకొంటూనే ఉన్నాడు."

"మిస్టర్ బాలకృష్ణా ! మీనాన్న ఓ ల్యాండ్ లార్డ్ !"

"కాదు. ఓ రెండెకరాల పేద్యగాడు."

"కదామరి ఆ రెండెకరాల కొంపతో మీ అమ్మనాన్న ఎలా సతమతమయ్యే వాళ్ళో తెలుసానీకు ?-అప్పుడు తెలుసుకొనే వయసు కూడాకాదు నీది"

"అవును"


"ఆ వయస్సులోనే మీ నాన్నపోయాడు"

"తెలుసు"

"ఏం తెలుసు ?"

"మానాన్న బావిలోపడి చనిపోయాడని !"

"మీ నాన్న బ్రతకలేక బావిలోపడలేదు. ఇంటిలోని పోరుతో విసిగి బ్రతుకును బావిపాలు చేసుకోలేదు. అప్పులనుండి విముక్తి పొందడానికి ఆత్మహత్యకు తలపడలేదు. ఓ రోజు తెల్లవారుజామున మడికి తడి వెయ్యడానికి మోటతోలుతున్నాడు. బానసరిగ్గా మునగలేదు. బాగా ముంచడానికి ఎద్దుల్ని వెనక్కులాగుతున్నాడు. అలాంటి సమయాల్లో పగ్గాల మోపుతో మనిషి బావివైపు బాగావాలిఉంటాడు ఉన్నట్లుండి బావిదరువు ఉర్లిపడింది. దోర్నం పట్టె-గురుజాలు-తన్నుకొయ్యలు- అన్నీ అలానే బావిలోనికి దొర్లుతుంటే-వాటి వెంటనే మోటతోలుతున్న మీనాన్న-ఎద్దులు-బావి వరమయ్యారు. ఆ 'పూటిమట్టే' క్రింద పడిగి పోయిన మీనాన్న శవాన్ని పైకి తీయడానికి



రెండురోజులు పట్టింది అలాంటి దుర్ఘటన ఆఫీసులో అదివరకెన్నడూ జరుగలేదు"

"దురదృష్టం"

"నీదికాదు. మీ అమ్మది. పసుపు కుంకుమలతో మిసమిసలాడే నీ తల్లి మొగం వసివాడింది. నువ్వుపుట్టే నీ తండ్రిని పొట్టనపెట్టుకొన్నావన్నారు ఆపల్లెజనం. అయినా నీ తల్లి నిన్ను గుండెల్లో పెట్టుకొని ఎన్ని అగచాట్లు పడిందో? నిన్నీ పైకి తేవడానికి!- గుర్తుందా నీకు?"

"లేకేమి?"

"ఉంటే-ఆమెనీతోనేఉండేది"

"ఉండవద్దని నేనెప్పుడూ చెప్పలేదు.

"అయినాఉండలేకపోయింది. ఎందుకు? పొంగుతున్న నీ సంసారంలోటు

"ఉప్పుగల్లు కాలేక"

"అదికూడా నాతప్పేనంటావా?"

"కాదు. నిన్ను కనడమే ఆమెతప్పు"

"ఒక్కక్షణం ఆగు. ఇప్పుడే వస్తున్నాడు నీదెవడో పానకంలో పుడకలాగ"

"మిస్టర్ బాలకృష్ణా! నీ అధికారంగొప్పది ఈ ఆఫీసులో నీ హోదాగొప్పది. వంచిన తల ఎత్తకుండా పనిచేయవలసిన బాధ్యత అంతకంటే గొప్పది. అయినా యింతవరకు ఈ ఆఫీసు నీమీద దయతలచింది. నీమానాన నిన్ను వదిలింది. అంతవరకు అదృష్టవంతుడివి అదిసరేకానీ ఆ వస్తున్నవాడి సంగతేమిటో మొదట తెల్సు!"

"తెలుస్తా! తెలుస్తా!! వాడూ వాడిమొగం చేతిలో కాగితం-కండ్లల్లోతడి-వంగి వంగి నడవడాలు-సెభాష్! వీడి నాటకం బాగా రక్తి కడుతుంది.

ఇంతకూ ఈ వెధవవేషాలన్నీ ఒకటి రెండు రోజుల సెలవు కోసమేనేమో!...

"సార్!"

"ఊ!...చెప్పు!"

"మా అమ్మ...."

"ఆఁ! మీఅమ్మ-కోడలికి నాకూ బొత్తిగా పడడంలేదు. నేవెళ్ళిపోతాను అంటూ వుందా ?"

"కాదుసార్ !"

"మరి ?"

"చావుబ్రతుకుల్లో ఉందట! టెలిగ్రాం వచ్చిందిసార్ !.... చూడండిసార్ !.... ఆ పల్లెటూళ్ళో దిక్కూ-దరీలేదుసార్ ! గొంతులో అంతమందు పొయ్యడానిక్కూడా డాక్టర్లుండరు. ఒకవేళ నేను వెళ్ళేటప్పటికే...."

విగ్గొట్టుకవస్తున్న ఏడుపు మాటల్ని మింగేసింది

"అయితే సెలవుపెట్టి వెంటనే వెళ్ళిపో !"

టెలిగ్రాంమీద యక్ష ప్రశ్నలు.... చావుబ్రతుకుల్లో వున్న అమ్మమీద సహాలక్ష ప్రశ్నలు-కోడిగుడ్డుకు ఈకలుపెరికే రకం ఆఫీసరు.... మారుమాట్లాడకుండా సెలవు మంజూరు చేసే సరికి-వచ్చినమనిషి ఉబ్బి తబ్బిబ్బులైపోయాడు అమ్మకు బాగయిపోయినంత ఆనందపడ్డాడు 'థ్యాంక్యూసార్ !.... థ్యాంక్యూసార్ !' అని తనలోతానే గొణుక్కొంటున్నట్టుగా గట్టిగానే అంటూ బయటపడ్డాడు !....



### టెలిగ్రాం

"ఏమిటండి ఇన్ని టెలిగ్రాములు ఇస్తున్నారు ఎవరయినా పోయారా ?" అడిగాడు క్లర్కు. జోగినాధాన్ని.

"అబ్బే....లేదండి. ఎలక్షన్లుకదా బంధువులందర్నీ రప్పిస్తున్నా" అన్నాడు జోగినాధం.

—సురేష్‌పాల్ (చిత్తూరు)

బాలకృష్ణ మళ్ళీ ఒంటరివాడైపోయాడు. అతని నెత్తిమీద పంకా తిరుగుతూనేఉంది అతని బుర్రలోనే ఆలోచనలు మళ్ళీ రెక్కలు విప్పుకొన్నాయి !....

"మిస్టర్ బాలకృష్ణా! తల్లి చావుబ్రదుకుల్లో వుంటే చూశావా అతడెలా తల్లడిల్లి పోతున్నాడో ?"

"చూశాను. అందుకేగదా వెంటనే సెలవు మంజూరు చేశాను"

"తల్లి చనిపోతూంటే-పొయ్యే ప్రాణాన్ని పట్టుకొంటే నిలుస్తుందా ? అని అడిగేకొడుకులున్నారు. తొమ్మిదినెలలు మోసి కని పెంచి పెద్దచేస్తే-ఆ పెద్దరికానికి దెబ్బ తగులుతుందన్న భయంతో "నాతల్లి" అని చెప్పుకోవడానికి నామోషీపడే కొడుకులున్నారు. కొడుకులు సంపాదించిన ఆస్తిపాస్తులతో కోడళ్లు పెత్తనం చలాయిస్తూ కులుకుతూంటే-ఆఘాటికి చిత్తయిపోతున్న తల్లుల్ని చూస్తూ నిస్సహాయంగా నిలబడిన కొడుకులున్నారు. వాళ్ళల్లో నువ్వుఒకడవై పోతున్నావేకానీ...."

"ఏం చేయాలి? సమ్మెల గొడవలు....పని నిర్వహణలో పద్ధతి పాటింపులు....పై అధికార్ల గూటింపులు....ఆఫీసు యిన్ని గొడవల్లో మునిగి తేలుతూంటే...."

"ఏ పిన్సియారిటీకి జోహార్లు! అయితే ఆత్మ వంచన కూడదు."

"ఆత్మ వంచనా?"

"కాదా మరి?-ఎవరినో మోసం చేస్తే అది వంచన. తన్నుతాను మోసం చేసుకోవడానికి యత్నిస్తే అది ఆత్మ వంచన.

"ఆత్మ వంచనకే పాల్పడి వుంటే నాకీ పేరు ప్రతిష్టలు వచ్చేవికావు. ఈ ప్రమోషన్ లభించేది కాదు. ఇంత గౌరవంగా బ్రతికే




అన్ని రకముల
కాలిక్యులేటర్లు :
సోనోవిజన్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2.

* ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక తగ్గింపు కలదు.

Suvarna



Grams: "PADMATYPE" PHONE: 512

**SRI VENKATESWARA TECHNICAL AGRICULTURE TRAINING COLLEGE**

POST BOX No. 36 CHILAKALURIPET - 522616. GUNTUR (Dt.)

S.S.C., INTER విద్యార్థులారా!

ఫెయిలైన సబ్జక్టులలో ఉచిత శిక్షణ

1981 జూలైలోకాని, మరి ఏ సంవత్సరములోనైన SSC INTER ఫెయిలైన విద్యార్థిని, విద్యార్థులకును మరియు 7th Class నుండి Degree వరకు ఏ ఒక్కటి, ఏ సంవత్సరములోనైనను పూర్తిచేసి ప్రస్తుతము ఖాళీగా ఉన్న నిరుద్యోగ విద్యార్థులకును ఈ క్రింది ప్రభుత్వ ఉద్యోగములలో నియమింపబడుటకు అగ్రికల్చర్ కోర్సునందు శిక్షణ ఇవ్వబడుచున్నది. (1) Field Man (2) Field Asst. (3) Tech. Asst. (4) Sub Asst. ప్రస్తుతము SSC INTER ఫెయిలైన విద్యార్థులకు ఆయా సబ్జక్టులలో ఉచిత శిక్షణతో పాటు భోజన వసతులు కల్పించును. ఒకే సమయములో రెండు కోర్సులు పూర్తిచేయవచ్చును. ప్రతినెల ప్రత్యేకమైన మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇవ్వబడును. స్త్రీలకు ప్రత్యేకమైన హాస్టలు కలదు. POSTAL ద్వారాకూడ శిక్షణ ఇవ్వబడును. పై ఉద్యోగములు చేయుదలచిన విద్యార్థిని విద్యార్థులు పైకూ అడ్రసుకు 10 రోజులలోగా రు. 4/- M.O. ద్వారాపంపి అప్లికేషన్ మరియు ప్రాస్పెక్టసును పొందవచ్చును.

ప్రిన్సిపాల్



పొడవు

"ఒంటెకు మెండ ఎందుకు పొడవుగా వుంటుంది?" అడిగారు సైన్స్‌మాస్టారు అనార్థనాన్ని.

"తలకు శరీరానికి దూరం ఎక్కువగా వుంటుంది కాబట్టి" తక్కున చెప్పాడు అనార్థనం.

–ఎ. నరేందర్ రెడ్డి (అనంతపూర్)

వాడివికాదు. ఆత్మవంచన చేసుకోవలసిన 'ఖర్మ' నా కెప్పుడూ పట్టలేదు."

"ఎప్పుడు పట్టలేదు. కానీ యిప్పుడు పట్టింది."

"అసలే ఎత్తి పొడుపులు. అందులో దొంక తిరుగుళ్ళు!"

"మిష్టర్ బాలకృష్ణా. మతి మరుపుకుకూడా ఓమితముంది. మరచిపోవడానికైనా యింకనూ నెల తిరగలేదే?–మీ అత్తగారికి 'సీరియస్' అంటూ ఓ టెలిగ్రాం వచ్చింది. జ్ఞాపకముందా?"

"ఉంది"

"ఆ రోజు ఎంత హడావుడి పడ్డావో? బ్యాంకువేళ దాటిపోయేసరికి ఎందరెందరికి ఫోన్లు చేశావో? అడగరాని వాళ్ళనంతా అడిగి డబ్బుకెంత యిబ్బంది పడ్డావో? మతికి తెచ్చుకో?–కాలుగాలిన పిల్లిలా నిలిచినచోట నిలవలేకపోయావు. ఎన్ని యిబ్బందుల్నయినా నిబ్బరంగా ఎదుర్కొన్నావు. కడకు కారుమీద హుటాహుటి బయలుదేరావు"

"అవును"

"అప్పుడు! 'ఆఫీసు యిన్స్‌పెక్షన్' జరగకంలేదా? నీ అసిస్టెంట్లు ఒక్కరికి యిద్దరు ఒక్కడేమో భార్య ప్రసవించిందని–ఇంకొక్కడేమో కూతురు పెళ్ళని–సెలవులో ఉన్నారు గదా? ఆఫీసు బాధ్యతలన్నీ అమాంతంగా నీ నెత్తిమీదనే పడ్డాయికదా?–మరి ఆ రోజు అడ్డు పడని ఆఫీసు బాధ్యతలు–ఈ రోజు ఉన్నట్లుండి బాధ్యతలై తలకెక్కాయి!"

"ఆ రోజు...."

"ఆ రోజు–నీ పెళ్ళాన్ని 'ప్లీజ్' చెయ్యడం నీ ధ్యేయం."

"ఒక విధంగా ఆలోచిస్తే అంతేననిపిస్తూ ఉంది."

"బుద్ధిమంతుడివే!–తలకేస్తే మొలకు మొలకేస్తే తల కన్నట్లుగా వాదించకుండా ఆ మాత్రం అంగీకరిస్తున్నావు. మంచిది. అత్తగారింటికివెళ్ళావు. వెళ్ళితేయేమయింది? అత్తగారికి జ్వరం. లేదంటే–కాస్త తీవ్ర తరం. దానికే అక్కడి హంగామానంతా గమనించావు. కొంపలు మునిగి పోతున్నట్లు యింటి నిండా జనం. వచ్చే పొయ్యేవాళ్ళ సందడి. అయిదు నిముషాలకొక్కసారి డాక్టర్ పరీక్ష. ఆ సంతను చూచి సన్నగా నవ్వుకొన్నావు. 'ఇది కలిగిన వాళ్ళ ముచ్చట' అని నీలో నువ్వు సరి పెట్టుకొన్నావు."

"అవునవును."

"ఆ మీ అత్తగారు నీ పెళ్ళానికి తల్లి గారు"

"వడ్ల గింజలో బియ్యపు గింజ"

"ఈ సత్యాన్నే గ్రహించలేని నువ్వొక పొట్టుగింజ"

"తిన్నగారానీ మాటలు"

"ఏం? కొడతావా?"





ఆయుర్వేదీయ

బైద్యనాథ్

దంతమంజన్

ఎఱ్ఱ పళ్ళపొడి

కేవలము పళ్ళపొడే కాదు! ఆయుర్వేద ఔషధము కూడాను!!

దంతములను చిగుళ్ళను గట్టి పరచును



ఇతర టూత్‌పేస్టులు,పళ్ళపొడులు దంతములను శుభ్రపరచును. వీనిలో ఔషధీ పదార్థములు లేనందున రోగముల నరికట్టలేవు. కనుకనే భారతదేశములో 90 శాతము ప్రజలకు చిగుళ్ళ బాధ లున్నాయి.

దంతనిపుణులున్నటువంటి కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియావారిచే ఆమోదించబడింది. ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధములను తయారుచేయు శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ వారిచే లవంగనూనె, వేప, తుమ్మ, శొంఠి, కర్పూరము మొదలగు అనేక అమూల్య వనమూలికలతో తయారు చేయబడినది. బైద్యనాథ్‌వారి ఎఱ్ఱ పళ్ళపొడి వాడుట వలన దంతములు, చిగుళ్ళు దృఢముగా, ఆరోగ్యముగా నుండును.

శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్

ఆయుర్వేద ఔషధముల తయారీదారులలో ప్రసిద్ధులు

INTERMARK/DML 197

"ఆశ్చర్యమేముంది?"

"హ్హ హ్హ హ్హ! అసమర్ధుడు అంతకంటే చేయగలిగిందేమి?—ఎదుటి వ్యక్తి మీద చూప లేని ప్రతాపాన్ని తనమీద తానే చూపుకొంటాడు. చేతికందిన దానితో తనకు తానే కొట్టుకొంటాడు."

"మాటలు పేనడమెందుకూ? ఈ అసమర్ధుడు గ్రహించలేనిది—నువ్వు గ్రహించిన సత్యమేమిటో చెప్పరాదూ?"

"అదే!— నీ అత్త నీ పెళ్ళానికి తల్లి. నీ పెళ్ళాం ఆ తల్లికి కూతురు. ఆ తల్లి ఆ కూతుర్ని ఎలా పెంచిందో తెలుసా?—తన పాలిస్తే తన సౌందర్యం తరిగిపోతుందని పిల్లకు పోతపాలు పట్టించింది. 'ఏంవండీ! పాపకు పోతపాలు పడుతున్నారా?' అని ఎవరైనా అడిగితే—'కన్న కవమాళం తిని మనమిచ్చే పాలకంటే— పోతపాలు ఎన్నోరెట్లు ఆరోగ్యకరం కదండీ?' అని దీర్ఘాలుతీసింది. ఆ పిల్లని ఆయాల చేతుల కప్పగించి క్లబ్బులని సాంఘిక సంక్షేమ కార్యకలాపాలని తాను ఊరి మీదపడేది. అలాంటి తల్లికోసమే—ఆ పిల్ల అంత తహతహ లాడిందే?—మరి నీ తల్లి! ఒక చంకలో కూర్చుని నువ్వు వదలకుండా లాగుతూంటే యింకొక చేత్తో ఆమె పనులు చేసుకొనింది."

"అవును"

"నీ తండ్రి అకాల మృత్యువు వాత పడ్డాడు. ఏ మాత్రం స్వార్థపరురాలైనా ఆమె ఆ వయస్సులో యింకొకరిచేత పడేది. కానీ నీ కోసం నీతిగా నిలబడింది. నమ్ముకోవడానికి నా అనే వాళ్ళు లేకపోయినా—తన రెక్కల్ని తాను నమ్ముకొనింది. కూలి : డవలి చేత పట్టింది. ఉన్న రెండెకరాలను గుత్తకిచ్చింది మిష్టర్ బాలకృష్ణా! నీ తల్లి బ్రతుకులో ప్రొద్దు మొగం చూచింది పొద్దు బారెడెక్కినపుడే!— అప్పుడు వంచేది నడుం. పొద్దు గూట్లో పడితేనే పైకి లేచేది. దీనికి ప్రతిఫలం—అంటే 'కూలి' ఎంతో తెలుసా? రెండుముద్దలసంకటి. రెండు మానెళ్ళు గింజలు!"

".... .... .... .... .... ...."

"ఏడుస్తున్నావెందుకూ?"

"అహ! కంటిలో ఏదో నలుసు పడింది."

"కలిగిన మాటలు ఎప్పుడూ కంటిలో నలుసులే:"

"చచ్చిన పామును కొడుతున్నావ్?"

"పాము చావలేదు బాలక్రిష్ణా! అలా భ్రమను కల్పిస్తూ ఉంది!"

"బదులు చెబితే గోడపెట్టు చెంప దెబ్బ రెండూ నాకే తగులుతున్నాయి"

"అయితే బదులు పలక్కుండా బుద్ధిగా విను"

"ఇంకా యేముంది వినడానికి!"

"ఇదో!—మాట్లాడనన్నావు మళ్ళీమాట్లాడు తున్నావు. నువ్వు మాట్లాడితే బదులు చెప్ప వలసి వస్తుంది. బదులు చెబితే బాధపడతావు."

".... .... .... .... .... .... ...."

"ఇదీ బుద్ధిమంతుడి లక్షణం. మిష్టర్ బాలకృష్ణా! మనిషి భవిష్యత్తును గురించి ఆలోచించినంత తీవ్రంగా గతాన్ని గురించి తలపోయడు, ప్రతి బ్రదుకులో మిట్టపల్లాలుంటాయి. మిట్ట మీది మనిషి పల్లంలో పడవచ్చు పల్లంలో మనిషి మిట్టమీది కెక్కవచ్చు. అయితే సాధారణంగా మనిషి పల్లంలో పడ్డప్పుడు మిట్టను గురించి చెప్పుకొన్నంత హాయిగా మిట్టమీద నిలబడిన మనిషి పల్లాన్ని గురించి ప్రస్తావించడు. అలా ప్రస్తావించడానికి నామోషీపడతాడు. నువ్వూ యింతే! నువ్వు పైకి వచ్చావు ఎంత పైకివచ్చావంటే- యిక్కడ నిలబడి తిరిగి చూస్తే నువ్వు ఉండింటొక అగాధమైన యిరుకులోయ. ఆ యిరుకు లోయను గురించి తలపోయలేవు. తలపోయడానికి ఆస్కారమూ లేదు. ఈరంగు రంగుల జీవితం.... ఈ హంగు సింగుల అధికారం—అన్నీ ఆకాశం నుండి ఊడిపడ్డట్టుగానే భావిస్తున్నావు కానీ—నువ్వు యింత దర్జాగా బ్రదకడానికి యింకొక్క జీవి చెమట కారణమని ఆలోచించలేకపోతున్నావు,

ఆ జీవి ఎవరో కాదు! -నీ తల్లి.

ఆ తల్లి తూర్పున పటమెగరకముందే నిద్ర లేచింది. తాను మొగం కడుక్కొంటుందో లేదో కానీ గుడిసెముందు మాత్రం కడిగి కళ్ళాపు చల్లింది. తాను చన్నీళ్ళతో మొగం కడుక్కొంటే వేడినీళ్ళతోనే నీ వొళ్ళు కడిగింది, ఆ తరువాత కూటి కుండలో చేయిపెట్టి దేవి దేవి చేతికందిన నాలుగు మెతుకుల్ని నీకు తినిపించింది. తాను కడుపు నింపుకొనేది మిగిలిన ముంతడు కూటి నీళ్ళల్లో ఓ ఉప్పుకల్లు వేసి!

ముదిగారం ముక్కుకు దారంగా వేసి నిన్ను బడికి పిలుచుకొని పోయేది. అక్కడ నిన్ను వదలిపెట్టి పరుగందుకునేది కూలికోసం కలగిన వాళ్ళ పెరు నాటటానికి కావచ్చు పైరు కోతకైనా కావచ్చు. లేదా—గొబ్బిళ్లని ఎరువు



భయం

"నీకేం భయంలేదు నేను డ్రయివింగ్ బాగా చేస్తానని నా మొదటి భార్య అనేది" అన్నాడు రామేశం, కామేశ్వరితో....

"మరి ఆవిడెలా పోయింది?" అడిగింది కామేశ్వరి.

"కారు ఏక్సిడెంట్ లో" అన్నాడు రామేశం.

—వకుళ (ఘన్ పూర్)


ప్రసూనా ట్యుటోరియల్స్
&
మాంటిసోర్రి పబ్లిక్ స్కూలు

హాస్టలు వసతి కలదు. స్టేషన్ రోడ్, సికింద్రాబాద్

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని,
నిలుపరా నీజాతి నిండు గౌరవము" అన్న మహనీయుల సూక్తులబాణి మావాణి.

K.G. నుండి V క్లాసు వరకు మాంటిస్సోరి విధానము.

7th, ఆంధ్రా మెట్రిక్, S.S.C. '81 సప్లమెంటరి, S.S.C. '82 క్లాసులకు ఏ పూర్వ విద్యార్హత లేకపోయినను తర్ఫీదునిచ్చి మొదటి ప్రయత్నంలో పాస్‌చేయించుట మా ప్రత్యేకత. ఇంటర్, బి.ఎ. బి.కామ్. క్లాసులకుకూడా అడ్మిషన్స్ మొదలుఅయినవి క్లాసులు 15-7-81 నుండి ప్రారంభమగును. కొద్ది సీట్లు మాత్రమేకలవు. 7వ తరగతి నుండివచ్చి S.S.C. మొదటిశ్రేణిలో ఉత్తీర్ణుడైన విద్యార్థి నెం 310323. రెండవశ్రేణిలో ఉత్తీర్ణుడైన విద్యార్థి నెం 310322. ఇవి కొన్ని మాత్రమే తొందర పడండి.



### పూరీలు

హోటల్లో టిఫిన్ చేస్తున్న దామోదరం పూరీల ప్లేటుతో నేరుగా మేనేజర్ దగ్గర కెళ్ళాడు.

"ఏమయ్యాశీ ! ఇవి పూరీలా ? ఇలాగేనా పూరీలు చేసేది ?'' కోపంగా అన్నాడు

"చూడండి మీరు పుట్టకముందునుంచీ నేను పూరీలుచేస్తున్నాను'' గొప్పగా చెప్పాడు మేనేజర్.

"కావచ్చు. కాపీవాటివి ఇప్పుడా అమ్మ టం ?'' అన్నాడు దామోదరం

—వి. బి నరసింహారెడ్డి (గుంటూరు)

గంపలకెత్తి పొలాలమీద చల్లడానికైనా కావచ్చు. ఆమె అక్కడికి వెళ్ళేటప్పటికే కూలీలు పనిలో వొంగి వుండే వాళ్ళు!

"ఏంవే సెల్లెమ్మా: ఒక్క అడుగుముందు రావడానికి నీకు తీరిందెప్పుడే ? ఏదో బతికి పెడిందనుకుంటే—దానికో ఓ మితముండ క్కర్లా ?" గనిమమీద నిలబడి రెడ్డమ్మ కమ్మగా రాగాలు తీస్తుంది.

కలిగిన వాళ్ళు. ఆలస్యంగా వస్తే అన గలిగినవోళ్ళు. అంటాయి. చేస్తున్నది కూలి. పడక తప్పదు.

అందుకే ఆమె నోరు కదపకుండా పనిలో దిగేది. పైరు నాటటం కానీ—లేదా కలుపు తీయడం కానీ—నడుం వంచి ఆమె 'మునం' పట్టిందంటే చేతులు పంతాలు పడేవి. తీరా తిరిగిచూస్తే అందరికంటే ముందుండేది. ఆల స్యంగా వస్తే రాగాలాపనలు చేసిన నోళ్ళు—'మునం' ముందుగాముగిస్తే మూగ బొయ్యేవి. అది వాటి లక్షణం ఆ లక్షణం బాగా వొంట పట్టింది కాబట్టే వాళ్ళు గనిమలమీద రెడ్డెమ్మ లాగా నిలబడగలిగారు

పొద్దునడి మిట్టకు వస్తుంది. అటి సంకటి వేళ. ఆ వేళప్పుడు అందరు చేతులు కడుక్కొం టారు ఆసిరి దాపుల్లో ఓ చెట్టు నీడను చేరు తారు. రెడ్డెమ్మ తలకొక్క ముద సంకటి వేస్తుంది. ఎడమచేతి అరచేయ ఆకు అవు తుంది. అరిచేతి ఆకులో సంకటి ముద్ద. ఆ ముద్దను గుంత చేసుకొంటారు. ఆ గుంతలో రెడ్డెమ్మ ఓ అబకవారు పోస్తుంది. ఆ ముద తింటూనే మరొక్క ముద్ద. తాటికాయంత పరి మాణంలోవున్న ఆ రెండు ముద్దల సంకటిని గొంతు కూర్చునే గుటగుట మింగుతారు. రెండు అరచేతుల్ని అలానే ఆనించి దోసిలిపట్టి మూతికి ఆనించు కొంటారు. ఆ దోసిట్లో నీళ్ళు పోస్తుంది రెడ్డెమ్మ. అలానే రెండు దోసిళ్ళ నీళ్ళు త్రాగుతారు. ఆ నీళ్ళతోనే చేతులు కడు క్కొంటారు. ఆ చెట్టు కింద అలానే నడుం వాలుస్తారు. ఎంతసేపు ?—కలిగినవాడు కమ్మగా ఆకూ వక్క నమిలినంతసేపు !—

అయితే మిష్టర్ బాలకృష్ణా ! నీ తల్లి అం దరు చేతులు కడుక్కొని చెట్టు నీడను చేరే సరికి ముద్ద సంకటి నోట్లో వేసుకొనేది. అం దరు ఓ ముద్ద సంకటిని చేతికి అందుకొనేసరికి నీ తల్లి రెండో ముద్దను చేతికి అందుకొనేది. ఆ ముద్ద సంకటికి పైట చెరగు అడ్డంగా అడ్డ దారి మీదపడి 'ఆసోబోసో' మని యింటికి వచ్చేది. ఆ గుడిసెలో వొంటరిగా కూర్చొని ఒళ్ళంతా కళ్ళుచేసి అమ్మకోసం నువ్వు ఎదురు చూస్తూ ఉండేవాడివి. అమాంతంగా చంక కెత్తుకొని ముద్దులాడుతూ ముద్ద సంకటి నీకు తినిపించేది. మళ్ళీ నీకు బడి వరకు తోడు. నిన్నక్కడ వదలిపెట్టి ఒక్క అగువులో పొలా నికి వెళ్ళేది. అప్పటికే కూలీలు పనిలో వంగి వుండేవాళ్లు. ఇక రెడ్డెమ్మ దీర్ఘాలా ? పరేసరి !—

మధ్యాహ్నం పూట అందరు అలా చెట్టు నీడలో నడుం వాలిస్తే—నీ తల్లి ఆ మాత్రం అదృష్టానికి కూడ నోచుకోలేకపోయింది.

మిష్టర్ బాలకృష్ణా ! నువ్వు పుట్టి పెరిగిం దొక పల్లెలో !—ఆ పల్లెకు నాలుగు మైళ్ళ దూరంలో ఓ పేట. తూర్పున అంతే దూరంలో మరొక్క పేట. వారానికి రెండు రోజులు ఆ పేటల్లో సంతలు జరుగుతాయి. ఆ సంతల్లో రైతులు తాము పండించినవి అమ్ముకొంటారు. తమకు కావలసినవి కొనుక్కొంటారు.

నీ తల్లి కూడా సంతలకు వెళ్ళేది. గుడ్డా గుసురు కొనడానికి కాదు. ఉప్పు పప్పు తెచ్చు కోవడానికి కాదు. పండించినవి అమ్మడానికీ కాదు. ఓ గాడిద బరువు నెత్తికెత్తి వెళ్ళేది. ఆ బరువు—ఎర్రగడ్డలో—తమలపాకులో—కాయకూరలో ఏదైనాకావచ్చు. నెత్తి బరువుకు తోడు ఎండ నెత్తిమీద ఉంటుంది. ఆ ఎండ పొద్దున చెమటలు కక్కుతూ నాలుగు మైళ్ళు నడిచేది. నెత్తి బరువుపేటలో నేలకు దించితే—మెడమీద తల నిలబడేదికాదు. ఆ కష్టానికి ప్రతి ఫలం—అంటే 'కూలి' ఎంత ? ఓ అర్థ రూపాయి !!

అంతటితో ఊరుకొంటుందా ?—ఉండదే ! సాయంకాలంవరకు పేటలోనే పడి గాపులు కాస్తుంది. మళ్ళీ ఓ మూట నెత్తికెత్తు కొం టుంది. మధ్యాహ్నం మోసుకొచ్చిన మూట సాయంకాలానికి రూపాంతరం చెందుతుంది—కలిగిన వాళ్ళయింటికి కావలసిన సరుకులుగా !

మిష్టర్ బాలకృష్ణా ! ఒక్కొక్క రోజు


## ది హైదరాబాదు కాలేజి ఆఫ్ కరస్పాండెన్స్ కోర్సెస్

స్కాట్ ట్యుటోరియల్స్, గాంధీనగర్ పి. ఓ కు దగ్గరలో

గోల్కొండ క్రాస్ రోడ్స్, హైదరాబాదు-500380

దిగువ తెల్పిన కరస్పాండెన్స్ కోర్సులకు ఆఫర్లు కోరబడుచున్నవి.

ఎం. ఇడి:— ఒక సంవత్సరము:- బి. ఇడి లేదా సమానమైన డిగ్రీ హోల్డర్లు

బి. ఇడి:— ఒక సంవత్సరము:— టీచరు అభ్యర్థులకు, పోస్టు గ్రాడ్యుయేట్లకు ప్రాము ఖ్యత ఇవ్వబడును.

బి. ఏ. ఎల్:— (బాచులర్ ఆఫ్ అకడమిక్ లాస్) 3 సంవత్సరాలు —డిగ్రీ హోల్డర్లు

డి. ఎల్. ఎల్:- (అడ్మినిస్ట్రేటివ్ లాతో లేబర్ లాస్‌లో డిప్లొమా) ఒకసంవత్సరము డిగ్రీ హోల్డర్లు

ఇప్పుడే త్వరపడండి! ప్రాస్పెక్టస్ కొరకు రు 5/-లు ఎం ఓ చేయండి.

(CA-624)

ఆమె పొలనుండి రావడానికి ఆలస్యమయ్యేది. నీ లేత గుండె తట్టుకోలేక తపన పడేది, అందుకే అలాంటి సమయాల్లో నువ్వు 'ఎదురు సేవ' వెళ్ళేవాడివి. కను చీకటి ఆవరిస్తున్న వేళల్లో ఆ బాటమీద కనుచూపుమేరలో ఓ స్త్రీ ఆకారం కంట పడితేచాలు, మీ అమ్మే అనుకొనే వాడివి. 'అమ్మా!' అంటూ పరుగెత్తి ఆ ఆకారం కాళ్ళకు పెనవేసుక పోయేవాడివి.

"ఒరే! నాబట్టా! కిట్టిగా!.... నేను కదంట్రా?.... మీ అమ్మయింకా ఎనకాల వస్తావుండాది," అని అంటూ గలగల నవ్వేదా ఆకారం.

నీ మూతి ముడుచుకొని పోయేది!

ఆ తరువాత అడుగడుగులో సందేహం! కంటపడిన ఆడ ఆకారం అమ్మ అవునో? కాదో? అన్న సందేహం!—ఆ సందేహంలో అడుగుమీద అడుగుపడేది. తీరా మీ అమ్మ ఎదురుపడినా నీ సందేహం మాత్రం నిన్ను వదిలేది కాదు. అప్పుడు మీ అమ్మే 'ఒరే సిన్నోడా! నువ్వా!!—ఈ సీగిట్లో యిందూరం వొంటిగా వొచ్చేస్తివే! యాడైనా నక్కాగిక్కా నోటగర్చుకొని పొయ్యుంటే ఏం చేసేదబ్బా?' అని అంటూ అమాంతంగా నిన్ను జీవురుకొనేది. చంకన వేసుకొనేది. నెత్తి బరువుకు మళ్ళీ నువ్వుతోడు. అయినా ఆ మాతృ హృదయం లెక్కపెట్టేది కాదు. సంత నుండి కొని తెచ్చిన ఒకడనో మురుకునో నీ చేతికిస్తే ఎంత సంబరపడి పోయేవాడివో?—గుర్తుందా మిష్టర్ బాలకృష్ణా?

పొలాల్లో కూలిపనులు చేసింది పేటకు నెత్తి బరువులు మోసింది. ఆ పనులు దొరకనపుడు అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చి అమ్మింది. అడవికి వెళ్ళే ఓపిక లేనపుడు ఆలమందల వెంట పడింది. పేడ యేరి తెచ్చింది. దిబ్బ పోసి పెట్టింది. ఆ దిబ్బను పంట ఎరువుకని అమ్మింది. ఎందుకు? జానెడు పొట్ట పోసుకోవడానికి కాదు. నీ భవిష్యత్తు కోసం!

ఆమె నీ తల్లి!—నువ్వు ఆమెకు బిడ్డవు!

ఆమెకు యేమీలేదు. వెనుకా ముందు ఎవ్వరూలేరు అష్టకష్టాలు పడింది.

తల్లిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చుకో గలిగింది.

నీకు అన్నీ ఉన్నాయి. హాయిగా బ్రదుకుతున్నావు. అయినా అవసానదశలో ఆ తల్లి బాధ్యతల్ని స్వీకరించలేక పోతున్నావు. ఇదే లోక రీతి! మిష్టర్ బాలకృష్ణా! ఓ తల్లికి అయిదారుగురు బిడ్డలుంటారు. ఆ తల్లి ఆ బిడ్డలందరికీ పాలిస్తుంది. అందర్నీ సమంగా చూస్తుంది. కానీ ఆ అందరు కలిసి ఆ ఒక్క తల్లి బాధ్యతను మాత్రం మోయలేరు అదే విచిత్రం! ఇంకను సిగ్గు పడవలసిన సంగతేమిటంటే—ఆ తల్లి బాధ్యతల్ని మోయవలసి వచ్చినపుడు పిల్లలు పంతులు పోతారు!



**పిల్లి**

"ఏరా చంటీ! మంచినీళ్ళుతాగాక వంటింటి తలుపు వెయ్యమన్నాకదా!" అడిగింది వాళ్ళమ్మ

"వేశానమ్మా!" అన్నాడు చంటి

"మరి గిన్నెలో పాలులేవేమిటి?"

"నేను తలుపువేసేటప్పుడు పిల్లిలోపలే వుందమ్మా!" మెల్లిగా చెప్పాడు చంటి

-అరుణారుణ్ (హైద్రాబాద్)

కళ్ళల్లో నీళ్ల.

ఎందుకు మిసర్ బాలకృష్ణా! ఈ పరిసితిలో కూడా నీ కళ్ళల్లో నీళ్ళుచూస్తే ఆతల్లిగుండె తల్లడిల్లుతుంది అన్న-ఆ తల్లి వ్రాయించిన ఉత్తరాన్ని ఆరోసారి చదవ పోతూంటే అడ్డు తగిలాను. ఏదీ! ఒక్కసారి నోరారా చదువు. విందాం!

" .... .... .... .... .... .... .... .... .... "

"మిష్టర్ బాలకృష్ణా! ఇంకనూ కళ్ళల్లో నీళ్ళు కారుతూనే ఉన్నాయి అదే వద్దన్నాను' నువ్వు మహా అందగాడవను కొంటుంది. నీ సైనో పైకిస్!- అందుకే అలంకరించుకోవడంలో మహా జాగ్రత్త పడుతుంది. భ్రమరంలా నీచుట్టూ తిరుగుతుంది ఇప్పటికే ఏదోఒక నెపంతోటి అయిదారుసార్లు వచ్చి వుండేది. ఏదో అవసరమైనపనుల్లో చిక్కుకొన్నట్లుంది బ్రదికిపోయావు. నీ కన్నీళ్ళు నీ గుండెను తేలిక పరచవచ్చు కానీ-ఎదుటివ్యక్తి ముందు నిన్ను చాలా తేలికచేస్తాయి. ఆపుకో! అమ్మ వ్రాయించిన ఆ ఉత్తరాన్ని చదువు.

"చదువుతాను"

"చదువు మరి!"

"సిన్నోడా! నువ్విప్పుడు పెద్దోడివి ఎంత పెద్దోడివంటే నీ కన్నతల్లి కంటపడలేనంత పెద్దోడివి, నిన్ను పెద్దోణ్ణి చెయ్యాలనే నేననుకొనింది. ఆరాట పడింది. నేననుకొనిందానికంటే ఎంతో పెద్దోడివై పోయినావు నాకింకే దిగుల్లేదు నాయినా! అందుకే టిక్కట్టు కొనుక్కొన్నాను

సిన్నోడా! నువ్వు సిన్నోడుగా వుండేటప్పుడు మన ఊరికె గుదాల బాటమీద ఒకటే


గెలవండి రూ 59,000లు

తారాపజిల్స్

నల్లకుంట, హైదరాబాదు—500044.

ఇప్పటివరకూ 5 పజిల్స్ వరుసగా విజయవంతంగా నిర్వహించి, పోటీదార్ల మెప్పు పొందిన ఏకైక సంస్థ.

5వ పజిల్ ఎంట్రీఫారం కొరకు 25 పైసల స్వంత చిరునామా కవరు పంపండి. పాల్గొనుటకు ముగింపు తేది 14-8-1981.



సెంటర్

అది జాగ్రఫీ క్లాసు
మాస్టారు ప్రశ్నలు వేస్తున్నారు.
"భూమికి మధ్యగా వుండే దాన్ని ఏమం టారు?" అడిగారు రవిని
"సెంటర్ ఫ్రెండ్" అన్నాడు రవి.
—కె.వి.వి. సత్యనారాయణ (అత్తిలి)

ఒక్క బస్సు పొద్దు మొలిపేటప్పుడు దిగబడి పోతే పొద్దు మునిగేటప్పుడు ఎగబడి పోతా వుందే! ఇప్పుడెర్ర బస్సులొచ్చినాయి ఒక్క పెవసపోతావుంటాయి ఎగబడీ దిగబడీ! అవి ఎప్పుడొస్తాయో? ఎప్పుడు పోతాయో వాటికే తెల్దు. టిక్కట్టు సేతిలో వుంది. ఎప్పుడే బస్సెక్కి పోతానో నాకే తెల్దు!"

"మిస్టర్ బాలకృష్ణా! ఒక వేళ నువ్వు వెళ్ళేటప్పటికే మీ అమ్మ ఏ ఎర్ర బస్సయినా ఎక్కి వెళ్ళి పొయ్యుంటే?

"అలా జరగడానికి వీల్లేదు!"

"ఏమిటా ఆవేశం?—ఎవరిమీదనీ అధి కారం? నువ్వు వీల్లేదంటే అదిరిపోయి ఆగి పోవడానికి నీ ఆఫీసులో గుమాస్తా కాదు బాల కృష్ణా!"

"అయితే నేనిప్పుడేం చేయాలి?"

"అదే ఆలోచించ మంటున్నాను. కన్న కొడుకుగా కాకపోయినా మనిషిగా!"

"ఇన్నాళ్ళూ మనిషి నన్న సంగతే మరచి పోయాను."

"తల్లికి బిడ్డ అన్న సంగతినే మరచినపుడు అదేమంత గొప్పసంగతి కాదు."

"అవును. పిచ్చి వ్యామోహంలో పడి తన కలాడాను. ఏది యేమైనా సరే! ఇప్పుడే వెళ్ళి నా తల్లిని నాయింటికి తెచ్చుకొంటాను. పువ్వుల్లో పెట్టి...."

"హ్హహ్హహ్హ! తీరా నువ్వు వెళ్ళేటప్పటికి పువ్వులే అవసరమవుతాయేమో?"

"అప్పు అక్కడికి నీ బాగుడు."

బాలకృష్ణ విసురుగా పైకి లేచాడు.

అంతకంటే విసురుగా బయటికి నడిచాడు!

* * *

బాలకృష్ణ ఊరికి ఎగుదల బాటమీద దిగ బడి వచ్చిన బస్సును దిగేసరికి కను చీకటి ఆవరిస్తూ ఉంది. ఇంతవరకు అతడిని— అతనితో కలిపి అందరి బరువు బాధ్యతల్ని బాధ్యతగా మోసుకొని వచ్చినబస్సు అతనిని మాత్రం దింపి చల్లగా జారుకొనింది, పెద్దగా రొదచేస్తూ!

'అమ్మ కెలావుందో?' అన్న ఆందోళనతో గుండె గుబగుబలాడుతూంది. మనిషి మెలికలు తిరిగి పోతున్నాడు. కనుచీకటి ఆవరిస్తున్న వేళలో అడ్డదారి మీదపడి ఆదరాబాదరా నడు స్తున్నాడు బాలకృష్ణ!

"ఒరే! పాప్పాముపిల్డి, మొన్నియ్యాలప కాదమండి కొటకలాడతావేవుంది. వచ్చిన పాణంగాదు, పొయ్యేనపాణంకాదు. వాడా యదవ బాలకిష్టు డొచ్చుంటే—యియ్యాలప కెప్పుడో నిమ్మతిగా పొయ్యేపాణం!"

"అదంతేరా దానెమ్మనుగొట్టిన పాణం. కలవరం పెట్టుకున్నాదంటే ఒకదాగానపోదు.

కీ. శే. శ్రీ కె. వేంకటేశ్వరరావుగారిచే స్థాపింపబడి 'నిస్వార్ధ సేవయే పరమార్థముగాగల'

# ఎస్. ఎస్. ఆర్. ట్యుటోరియల్ కాలేజిలో

## ఎస్. ఎస్. సి. (సప్లిమెంటరీ '81/ఏప్రిల్ '82) తరగతులతో

7, 8, 9 తరగతులు చదివి త్వరలో ఎస్. ఎస్. సి. పూర్తిచేయదలచుకున్న లేక ఎస్.ఎస్.సి. తరగతిలో చేరదలచుకున్న (13, 14 ఏండ్లపై వయస్సుగల) బాలురకు క్రొత్త బ్యాచీలు ప్రారంభమగు కానున్నవి.

(తెలుగు, ఇంగ్లీషు మీడియములలో వేర్వేరు తరగతులు కలవు)

అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరము పురస్కరించుకొని వికలాంగులైన విద్యార్థులకు, **1981** సెప్టెంబరు ఎస్. ఎస్. సి. పరీక్షకు మూవద్ద ఉచితముగా విద్య గరుపబడును.

ఇంటర్మీడియెట్ మొదటి, రెండవ సంవత్సరము సప్లిమెంటరీ '81/ఏప్రిల్ '82 పరీక్షలకొరకు తరగతులు ప్రారంభమైనవి.

పూర్తి వివరములు ఆఫీసునందు తెలిసికొనగలరు.

ఫోను: 56526, బ్యాంకువీధి, హైద్రాబాద్-1. ప్రిన్సిపాల్.

వాణ్ణిసూళ్ళా! వోసిఁప్రగఁళ సిద్ధులుగాణ్ణి. పిన నారినాకొడుకు, సిల్లర దుడ్లు దోటిసెంబులో వోసుకోని సెవలకాడ గిలకరిస్తేనే కదా పొయ్యింది."

"వాణ్ణేఁవో అట్టంటావుండావు. ఈడ సిరిపి రెడ్డిగారి వడిపిరెడ్డి గతియేఁవాయెరా? తొళిసి తీర్తాని వొడులు నీళ్ళలో పిల్లర దుడ్లేసి గిలక రించి గొంతులో వోస్తేనేకదా గురుడు గుటు క్కుందిఁ."

"అకంతేలేరా! ముసిలానికి కొడుకంటే పాణం. ఆపాణం వస్తేగదరా ఈ పాణం వొయ్యేదానిక!"

"ఊరికే అన్నారంట్రా పెద్దోళ్ళు!—కన్న పేగునుకోసి కల్లమిందేస్తేకూడా 'కొడకా! కొడకా!' అని కొటుకలాడుతుందంట!"

చేలల్లో పనులు ముగించుకొని అప్పుడే ఇంటిముఖంపడుతున్న రైతులు తలకొక్క తీరుగా తలపోస్తున్నారు.

YUVRAJ MULTI-MIX (Mixer-Cum-Grinder)
WITH ONE YEAR GUARANTEE
● A MIRACLE ! Complete Kitchen Machine
● Double Speed Stainless Steel Grinder
● TEN DAYS FREE HOME TRIAL at your home
ORIGINAL PRICE Rs. 550/- BUT NOW
ONLY FOR Rs. 280/-
(Inclusive sales tax) with FREE Postage and Beautifully Foam Packing
MONEY BACK GURANTEE IF DISAPPROVED
To get it at home by V. P. P. anywhere in India, send us your order of YUVRAJ MIXER-CUM-GRINDER to-day. Please write us in English only.
JOHNSON ELECTRONICS (AP)
16/96, Subhash Nagar, NEW DELHI-110027



టీచర్స్ ట్రైనింగ్ అడ్మిషన్లు

| KIND OF COURSE | ELIGIBILITY | DURATION OF COURSE |
|---|---|---|
| 1. NURSERY (NTT) | S.S.C/Matric | 6 months |
| 2. SECONDARY GRADE | INTER | 9 months |
| 3. B.Ed | Degree | 1 Year, |
| 4. M.Ed | B.Ed, Degree | 1 Year |

Age Relaxe and Fee Concession to: sc/st/bc students

ప్రసాద్ కామర్స్ కాలేజి (Recogd)
బృందావన్‌గార్డెన్స్-గుంటూరు-6
డైరెక్టుగా 1 పం॥లో B.A/B.Com (ప్రైవేటు). ప్రైవేటుగా MBA/LAW పరీక్షలకు కూడా శిక్షణ పొందవచ్చును



**కవిత**

"ఊర కుక్కలు అరిచిఅరిచి నిద్ర పోతు న్నాయి కీచురాళ్ళు కీచుకీచు మంటున్నాయి, ఎక్కడో కూసింది కోడి. అప్పుడే దిగాను విమురు వాహనం...." ఇది ఓ సభలో కవి గారి కవితాగానం

వెంటనే సభలో కలకలం- ఏమీ అర్థం కావడంలేదని-

మరో మైకులో అనౌన్స్ చేశాడు సుబ్బా రావు'' కవిగారు తెల్లవారుజామున వచ్చారట ఈ ఊరు'' అని.

-రమాసత్యం (హనుమకొండ)

ప్రశాంతంగావున్న ఆసంజవేళలో బాలకృష్ణ చెవులు చిల్లులుపడుతున్నాయి. తల దిమ్మతిరిగి పోతూవుంది- భరించడం బాధాకరంగావుంది. కంపలమీద కయ్యలమీదపడి కాలికొద్దీపరుగెత్తు తున్నాడు.

అక్కడ గుడిసెలో—

"వాడొచ్చేదీలేదు, సచ్చేదీలేదు. సెంబులో నీళ్ళని పెట్టండి. రెడ్డోరి యింటెనక్కపొయ్యి అంత తొళిశాకు గిల్లుకొనిరండి. కాళ్ళకింద పోసేదానికి దోసెడువడ్లగింజలైనా వుండాయో లేదో? సూడండి. తలకాడికి దీపం కావద్దా? ఈ గుడిసెలోవుండేది కిరసనాయిలు బుడ్డీ దీపంగా వుందే? ఓ పఁవిదతెచ్చి అంతసఁవురు పోసిపెట్టండి. ఇప్పుడో ఇంకొంతసేపటికో మంచంమీదనుండి దించేయాలింందేకదా?"

ఊళ్ళో తలనెరిసిన పెద్దలు గుడిసెముందు కూర్చుని తలపోసుకొంటున్నారు.

"అదో! బాలకిష్ణ డొచ్చేసినాడు!"

"వచ్చేసినాడా? వచ్చేసినాడా?"—

బాలకృష్ణ రావడం ఓవింతగా పరిణమించి ఆగుంపులో కలకలంబయలుదేరింది.

అంతవరకు నీటినుండిపెరికి ఎండవేసిన అల్లికాడలా మంచానికి అతుక్కొనిపడివుండిన మునలికాయంలో కాస్తచైతన్యం!

వదలిరాలిపోవడానికి సిద్ధంగావున్న పూరేకు ల్లాంటి రెప్పలు మెల్లగా విచ్చుకొన్నాయి.

అందరివైపు ఒకసారి కలియజూసి చూడటా నికి ప్రయత్నం!

'అమ్మా!' అని అరుస్తూ బాలకృష్ణ మంచంప్రక్కన కుప్పగాకూలిపోయాడు.



**చెబితే**

"పాపం ఆ మూగవాడ్ని ఎందుకు కొట్టా
వంకీ" జాలిగా అన్నాడు జోగేశ్వరరావు

"అలావి ముందేచెబితే ఎందుకు కొడ
తాను" అన్నాడు పాపారావు

—ఎస్ రషీద్ (దోమకొండ)

ఎలా కూడగట్టుకొనిందో శక్తిని ఆముసల్ది.

ఓ చెయ్యి మెల్లగా పైకిలేచింది!

అది ఎత్తిపెంచిన చేయి అన్నం తినిపిం చిన చేయి ఒడిలో వేసుకొని జోకొట్టిన చేయి. ఇంతటివాణ్ణిగా తీర్చిదిద్దిన చేయి!

బాలకృష్ణ తల ఆధారంగా తడబడుతూ ఉంది!

బ్రదుకు బరువును మోయలేనికొడుకు చేతి బరువును మోస్తున్నాడన్న తృప్తి కాబోలు!

"నాయినా!....బాలకిష్టా! వచ్చేస్తివా నాయినా!—"తిరుగలేక తిరుగుతున్న పెదవి మలుపులనుండి అందుతున్న భాష! ఆ తల్లి హృదయ ఘోష!!

"అమ్మా! బాలకృష్ణుణ్ణి కాదమ్మా! నీ సిన్నోణ్ణమ్మా! సిన్నోణ్ణి!"

"సిన్నోడివి కాదు నాయినా! బాలకిష్టుడివి"—అన్నభావన చిరునవ్వుగా బోసిపెదవులపై వెలిసి వెలవెలపోయింది.

"నా బిడ్డ....బాలకిష్ట....అలసిపోయ్‌నాడే—అంత కాపీ....కుర్సీ...." అక్కడికక్కడ తెగుతూ నూతిలోనుండి వినిపిస్తున్నాయి మాటలు!

చావు తెలివి అంటున్నారెవ్వరో!

"అమ్మా! నాకు కాఫీ వద్దు. కుర్సీలొద్దు ఏఁవీ వొద్దు. నన్ను 'సిన్నోడా' అని ఒక్క సారి పిలువమ్మా! ఒక్కసారి పిలువమ్మా!"

మంచం కోడుకు తల బాదుకొంటూ విలపిస్తున్నాడు బాలకృష్ణ.

ఇంకా ఎక్కడుందాతల్లి 'సిన్నోడా' అని పిలువడానికి?

'అంత తొలిసి తీర్థం గొంతులో పోయ్‌డానికి కూడా లేకుండాపోయెనే! ఆ! దేనికైనా ఋణవుండాల!" అని నిట్టూరుస్తూ మంచం మీదినుండి కిందికి దించుతున్నారా జీవంలేని కట్టెను! పైటచెరగు తొలగింది!!

వాడి వత్తలైన అమ్మ రొమ్ములు. తనకు పాలిచ్చిన రొమ్ములు. శివుని గుడిలో విభూతి తిత్తుల్లా వ్రేలాడుతున్నాయి.

బాలకృష్ణ చూశాడు. చూడలేక కళ్ళు మూసుకొన్నాడు.

"ఈ పైటచెరగు మరుగులోనే యింత వ్యక్తిత్వాన్ని పెంచుకొన్నాను. మరో పైట చెరగు మరుగుకోసం ప్రాకులాడి వ్యక్తిత్వాన్నే చంపుకొన్నాను. నేను మనిషిని కాను. నేను మనిషిని కాను".

ఆమరుసటిరోజు ఉదయాన ఆమె అంతిమ యాత్రకు చేయవలసిన యేర్పాట్లను కొందరు చర్చిస్తూంటే—ఆరాత్రి శవజాగరణకు మరి కొందరు వంతులుపడుతున్నారు.

చివరిసారిగా 'సిన్నోడా' అని పిలిపించుకోలేకపోయిన బాలకృష్ణ గుడిసెముందు కూలబడి కుమిలికుమిలి యేడుస్తున్నాడు.


వినూత్న సాంప్రదాయానికి నాంది

స్వాతి*

★ సర్వోన్నతమైన నాణ్యత
★ సర్వోన్నతమైన పనితనం
★ సర్వోన్నతమైన సుందరరూపం

దేశంలో 7 సం॥లు
గ్యారంటీతో లభించే
ఒకే ఒక కుట్టుమిషన్
మీ ఇంటికే అలంకారం




SWATHI®

సుదృఢమైన నిర్మాణానికి ప్రతీక

ADWAYE